AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
27-7-2026 (Monday)
MAIN EDITION

## మత్తులో పోలీసులను కారుతో ఢీకొన్న యువకుడు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో దారుణం చోటు చేసుకుంది. డ్రగ్స్ మత్తులో ఓ యువకుడు పోలీసులపైకి కారు ఎక్కించాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్, సీఐ గాయపడ్డారు. నగరంలోని అబిడ్స్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు నిఘా పెట్టారు. డ్రగ్స్ పెడ్లర్ కారులో అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ వద్దకు వచ్చి సరఫరా చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిందితుడు కారును పక్కకు తీస్తున్నట్లు నటించాడు. అనంతరం పోలీసులపైకి కారు ఎక్కించి పరారయ్యాడు. నిందితుడు కారు ఎక్కించడంతో కానిస్టేబుల్ మహేందర్‌కు కాలు విరిగింది. అనంతరం అక్కడి నుంచి తప్పించుకున్న నిందితుడిని అఫ్జల్‌గంజ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## భారీ లాభాలతో ముగిసిన సూచీలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్ ఐదు సెషన్ల తర్వాత లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 776 పాయింట్లు, నిఫ్టీ 228 పాయింట్లు పెరిగాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గుతుండడంతో క్రూడ్ ఆయిల్ ధర దిగివస్తోంది. బ్యారెల్ ధర 89 డాలర్లకు తగ్గింది. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పాజిటివ్‌గా మారడంతో ప్రధాన సూచీలు పరుగులు తీశాయి. అన్ని రంగాలలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. చివరికి సెన్సెక్స్ 776 పాయింట్ల లాభంతో 76,835 వద్ద, నిఫ్టీ 228 పాయింట్ల లాభంతో 23,995 వద్ద స్థిరపడ్డాయి.

### ఆస్పత్రి నుంచి వాంగ్‌చుక్ డిశ్చార్జ్



అక్షరటుడే, ఢిల్లీ: గురుగ్రామ్ మేదాంత ఆస్పత్రిలో చికిత్స పొందిన పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన ఆయన, రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా గాంధీకి నివాళులర్పించిన అనంతరం లడాఖ్‌కు పయనం కానున్నారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే.

### భారీ వేతనంతో 395 ఉద్యోగాలు




అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 395 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ అయ్యింది. పోస్టు ఆధారంగా డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ, సీఎంఏ, ఎంటెక్ ఉత్తీర్ణత, బ్యాంకింగ్ అనుభవం ఉన్నవారు అర్హులు. ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

### కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు స్వర్ణం



అక్షరటుడే, స్పోర్ట్స్‌డెస్క్: కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌ను ఆమె ఓడించ డం గమనార్హం. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో మను తీవ్రంగా పోరాడి కాంస్య పతకం దక్కించుకుంది.




## ఈ–20 జనతా పార్టీ ఏర్పాటు..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశంలో మరో వ్యంగ్య రాజకీయ పార్టీ ఏర్పాటు అయింది. కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలతో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జెన్‌జీ యువత ఇన్‌స్టాగ్రామ్ వేదికగా.. ఈ 20 జనతా పార్టీని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌లో ఇథనాల్ కలుపుతున్న విషయం తెలిసిందే. గతంలో 10 శాతం ఇథనాల్ కలుపగా.. ఇటీవల దానిని 20 శాతానికి పెంచింది. దేశవ్యాప్తంగా ఈ 20 పెట్రోల్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వాహనాలు పాడవుతాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఇథనాల్ మిశ్రమ ఇంధనానికి వ్యతిరేకంగా 'ఈ20 జనతా పార్టీ'ని కొందరు ఏర్పాటు చేశారు. ఈ-20 పార్టీకి ఇన్‌స్టాగ్రామ్‌లో 2 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఈ సంఖ్య వేగంగా పెరుగుతోంది. తక్కువ ధరకు 100 శాతం అసలైన ఇంధనాన్ని ఎంచుకునే స్వేచ్ఛను, ఈ20 ఇంధనంపై డిజిటల్ వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజీనామా చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ-20 ఇంధనం వల్ల మైలేజీ తగ్గుతుందని, వాహనాల ఇంజిన్లు దెబ్బతింటాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు.

## నన్ను చంపాలని చూశారు..: జోగి రమేశ్ కోడలు ఆరోపణలు

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు జోగి రమేశ్‌పై ఆయన కోడలు సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపాడానికి జోగి రమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులు ప్రయత్నించారని ఆరోపించారు. జోగి రమేశ్‌కు కుమారుడు రాజీవ్ భార్య మేఘన తన మామపై సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపడానికి ప్రయత్నించారని, అదనపు కట్నం కోసం వేధించారని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన వివాహం సూర్యాపేటలో జరిగిందని ఆమె తెలిపారు. ఆ సమయంలో రూ.5 కోట్ల నగదుతో పాటు 1.5 కిలోల బంగారం, 10 కిలోల వెండి ఆభరణాలు ఇచ్చారని పేర్కొన్నారు. పెళ్లయిన కొన్నాళ్ల నుంచే అత్తింటి వారు అదనపు కట్నం కోసం తనను వేధించడం ప్రారంభించారని ఆమె పేర్కొన్నారు.

**నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా యాంటీ పేపర్ లీక్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుకు ఇటీవల మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. పరీక్షా పత్రాల లీకేజీ నేరాలపై కఠిన చర్యలు తీసుకునేలా రెండేళ్ల క్రితం నాటి చట్టాన్ని సవరించే బిల్లును సోమవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సభలో ప్రవేశ పెట్టారు.**

**–అక్షరటుడే, నేషనల్ డెస్క్**



# యాంటీ పేపర్ లీక్ సవరణ బిల్లు

**లోక్‌సభలో ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం**

**విపక్షాల నిరసన**

**కొనసాగుతున్న వాయిదాల పర్వం**

పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026'ను కేంద్ర మంత్రి సభలో ప్రవేశ పెట్టారు. అనంతరం ప్రతిపక్షాల నిరసనల కారణంగా సభను స్పీకర్ వాయిదా వేశారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. చర్చలో పాల్గొనాలని విపక్షాలను కోరారు. ఈ రోజు, పరీక్షా పత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా ఒక పటిష్టమైన బిల్లును తీసుకువస్తున్నామని తెలిపారు. చర్చలో అన్ని పార్టీలు పాల్గొనాలని కోరారు. ఈ బిల్లు కేవలం జరిమానా మాత్రమే విధిస్తుందని, లీకేజీలను నివారించదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అభిప్రాయపడ్డారు.

**యువ ఎంపీలతో..**

దేశంలోని 'జెన్‌జెడ్' మనోభావాలను తమకు అనుకూలంగా మలుచుకునే వ్యూహంలో భాగంగా ఈ బిల్లుపై మాట్లాడటానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి యువ ఎంపీలను రంగంలోకి దించనుందని సమాచారం. మాట్లాడే వారిలో బీజేపీకి చెందిన బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్య, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన సాయోని ఘోష్, మితాలి బాగ్, టీడీపీకి చెందిన లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉండే అవకాశం ఉందని సమాచారం.

**10 గంటల పాటు**


ఈ బిల్లుపై 8 నుండి 10 గంటల పాటు చర్చించనున్నట్లు తెలిసింది. విద్యా శాఖకు సంబంధించిన ప్రశ్నలను అడగడానికి కూడా ఈ రోజు షెడ్యూల్ రూపొందించారు. దేశ నూతన విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సంబంధిత అధికారులు ఇప్పటికే పూర్తి వివరాలు అందించారు. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టం' 2024లో అమల్లోకి వచ్చింది. ఇప్పుడు ప్రతిపాదించిన సవరణలు ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తాయి. ప్రశ్నపత్రాలను లీక్ చేసినందుకు కఠినమైన శిక్ష విధించడమే కాకుండా, వేగవంతమైన విచారణల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడం, అటువంటి కేసులను రెండు నెలల్లోగా పరిష్కరించడం వంటి నిబంధనలను ఈ బిల్లులో పొందుపర్చారు. పరీక్షలలో అక్రమాలకు పాల్పడిన వారికి కనీసం ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించాలని ప్రతిపాదించారు. సంఘటిత నేరాలకు పాల్పడిన వారికి కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా విధించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది.

## రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. జులై 27 నుంచి 30 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, మహబూబాద్, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వానలు పడే ఛాన్స్ ఉంది. 100-120 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. నల్గొండ, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వానలు కురుస్తాయి. మిగతా జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయి. వ్యవసాయ పనులకు ఈ వానలు ఎంతో మేలు చేస్తాయి.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తప్పించండి: హైకోర్టు




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు ఉత్తర్వులను ఒక ఉన్నతాధికారి ఇన్నిసార్లు ధిక్కరించడం సరైన పద్ధతి కాదని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ఆయనను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శినిఆదేశించింది.

## విద్యా రంగాన్ని నాశనం చేసిన బీజేపీ

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేంద్ర ప్రభుత్వంపై ఎస్పీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. విద్య, పరీక్షలకు సంబంధించిన పోరాటం చాలా పెద్దదన్నారు. యువతలో ఉన్న చైతన్యాన్ని, వారి మనోబలాన్ని ఆయన అభినందించారు. వారి చైతన్యాన్ని ఈ ప్రభుత్వం సవాలు చేయలేదన్నారు. పరీక్షల సంస్కరణ కోసం కేంద్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సమాజ్‌వాది పార్టీ అధినేత స్పందిస్తూ.. ప్రభుత్వం ఈ టాస్క్ ఫోర్స్‌ను ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తోందని ప్రశ్నించారు. 2014లోనే ఎందుకు ఏర్పాటు చేసి ఉంటే.. దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందేదన్నారు.



## ఫుడ్ ఫెస్టివల్‌లో కాల్పులు.. ఇద్దరు మృతి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. సియాటిల్‌లోని స్పేస్ నీడిల్ సమీపంలో ఉన్న ఒక ఈవెంట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌లో ఓ వ్యక్తి కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. బైట్ ఆఫ్ సియాటిల్ ఫెస్టివల్ సందర్భంగా సియాటిల్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కాల్పులు జరిగాయి. హార్బర్‌వ్యూ మెడికల్ సెంటర్ ప్రతినిధి సూసన్ గ్రెగ్ మాట్లాడుతూ ఒక చిన్నారి, 23 ఏళ్ల యువకుడు, ఇద్దరు మహిళలతో సహా నలుగురు బాధితులను ఆసుపత్రిలో చేర్చామన్నారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

## మతం మార్చుకుంటే ఎస్సీ హోదా కోల్పోతారు: సుప్రీం



**అక్షరటుడే, ఢిల్లీ:** మతం మార్చుకుంటే ఎస్సీ హోదా కోల్పోతారని గతంలో ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పుపై దాఖలైన రివ్యూ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు ఒక వ్యక్తి షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని మార్చిలో ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై దాఖలైన సమీక్ష పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఇతర మతాలకు మారితే ఎస్సీ హోదా రద్దు అవుతుందని స్పష్టం చేసింది. తిరిగి హిందూ, సిక్కు, బౌద్ధ మతంలోకి వస్తేనే ఎస్సీ హోదా పొందవచ్చని తెలిపింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తాము సమీక్ష పిటిషన్‌ను పరిశీలించామని, మునుపటి తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించలేదని పేర్కొంది.

## కాపులంతా ఏకం అవుతారు.. బోండా ఉమా



**అక్షరటుడే, ఏపీ:** టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు కౌంటర్ ఇచ్చారు. కాపు నేత ముద్రగడ పద్మనాభం ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన సంతాప సభకు బోండా ఉమ హాజరయ్యారు. ఆ సమయంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో ఆయన మాట్లాడారు. అంతేగాకుండా కాపుల ఉద్యమాన్ని పట్టించుకోకపోవడంతో 2019లో ఏపీలో టీడీపీ ఓడిపోయిందన్నారు. ఆయన వ్యాఖ్యలపై టీడీపీ అధినేత సీరియస్ అయ్యారు. వెంటనే వివరణ ఇవ్వాలని ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై బోండా ఉమా స్పందిస్తూ తనకు ఎలాంటి నోటీసులు రాలేదని తెలిపారు. అయితే వివరణ అడిగితే ఖచ్చితంగా ఇస్తానని చెప్పారు.

## లాఠీఛార్జీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, ఢిల్లీ :** శాంతియుత నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం ఆందోళన జరుగుతోందన్న కారణంతో లాఠీఛార్జికి ఆస్కారం లేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీకేజీపై నిరసనల్లో భాగంగా జూలై 20న పార్లమెంటు వైపు విద్యార్థులు చేపట్టిన 'సంసద్ చలో' పాదయాత్రపై భాష్పవాయువు, లాఠీల ప్రయోగం జరిగిన ఘటనలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. వీటిపై ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. శాంతియుత, చట్టబద్ధమైన నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం ప్రకారం సంపూర్ణంగా ఇవ్వబడిందని కోర్టు పేర్కొంది. అది శాంతియుత ఆందోళన అయినంత వరకు, కేవలం ఆందోళన జరుగుతోందన్న కారణంతో లాఠీఛార్జికి ఆస్కారం లేదని స్పష్టం చేసింది.